RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 224

శనివారం
ఆగస్టు 02, 2025


పేజీలు : 4
వెల : రూ.3-00



యూరియా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

3లో..

- ప్రజల ప్రాణాలంటే అంత చులకనా?
- తనిఖీలు మరిచిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలుండవా?
- ప్రజా ప్రభుత్వంలో జనం ఆరోగ్య సం'రక్షణ'పై పట్టింపు లేదా?
- ఉన్నతాధికారులు స్పందించాలని నగరవాసుల వేడుకోలు



# విధులు మరిచారా..?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

ప్రజా ప్రభుత్వంలో సామాన్య జనం ఆరోగ్య సం'రక్షణ' విషయమై కీలక బాధ్యత పోషించాల్సిన డ్రగ్ ఇన్ స్పెక్టర్లు తమ విధులు మరిచారని నగరవాసులు ఆరోపిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ నగరంలో మెడికల్ మాఫియా రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్నా.. తమకు పట్టింపే లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సదరు అధికారులు విధులు మరిచారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా మెడికల్ షాపుల నిర్వహణ విషయంలో కొందరు నిబంధనలకు నీళ్లు వదిలినా.. ఇష్టారాజ్యంగా దందా కొనసా..గిస్తున్నా.. అసలు అటు వైపు కన్నెత్తి చూడటం లేకపోవడంతో.. అసలు వ్యవస్థ ఉందా? అనే అనుమనాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు.

**- నో డ్యూటీ.. మాకు షరా 'మూమూలు' విధులు!**

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల వ్యవహార సరళి, తీరు షరా 'మామూలు' అన్నట్టుగా ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నగరవ్యాప్తంగా మెడికల్ దందాను కొందరు నిబంధనలు పాటించకుండా కొనసాగిస్తున్నట్టు బహిరంగంగానే స్పష్టమౌతున్నది. అయినప్పటికీ తమకు కనీసం పట్టింపు లేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వేతనం సమయానికి అందితే చాలు.. ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారినా తమకేంటి? అనే రీతిన వ్యవహరిస్తున్నట్టు కనబడుతోంది. వారు విధిగా తనిఖీలు చేయాలనే సంగతిని సైతం మరిచారా? అసలు గుర్తుందా? అనే ప్రశ్నలు అయితే వెంటాడుతున్నాయి. కనీస పర్యవేక్షణ కూడా మరిచానా ఉన్నతాధికారులు ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారనేది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. మామూళ్లు తీసుకొని షరా 'మామూలు'గా కార్యాలయానికే పరిమితం కావడమే వారు విధిగా భావిస్తున్నారా? అని పలువురు అడుగుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే 'మాకేంటి?' అనే తీరు సరికాదని, ప్రజా ప్రభుత్వంలో పేరుకే 'ప్రజలు' ఉంటారా? ప్రజల ఆరోగ్య సం'రక్షణ' విషయమై బాధ్యత మరిచిన సదరు అధికారులపై కఠిన చర్యలు ఉండాలని, ఆ దిశగా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని జనం కోరుతున్నారు.





## పరిమళించిన మానవత్వం

- పోలియోతో బాధపడుతున్న విద్యార్థినికి వీల్ చైర్
- మానవత్వంతో స్పందించిన డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ హైదర్

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రం కాసింపల్లికి చెందిన ఒక నిరుపేద విద్యార్థిని సయ్యద్ సబ్జాన్ బి (తండ్రి పేరు సయ్యద్ హుస్సేన్) పుట్టుకతోనే రెండు కాళ్లు మెలి తిరిగి పుట్టడంతో నడవడానికి చాలా ఇబ్బంది ఉన్న పరిస్థితి. అయినా కూడా చదువుపై ఉన్న మమకారంతో కుంటుకుంటూనే ప్రతిరోజు నాలుగు కిలోమీటర్లు కుంటుకుంటూనే కమలాపూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కు వెళ్తుంది. ప్రస్తుతం ఈ విద్యార్థిని 7వ తరగతి చదువుతుంది. ఈ విషయం తెలుసుకున్న డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ హైదర్ మానవత్వంతో స్పందించి డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, ఎఫ్ ఆర్ వో రవికృష్ణ లతో మాట్లాడి విద్యార్థినికి వీల్ చైర్ ఏర్పాటు చేయించారు. డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ హైదర్ మానవత్వంతో స్పందించిన తీరు పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు, అధికారులతో పాటు పలువురు గౌస్ హైదర్ పై, తమ దృష్టికి వచ్చిన వెంటనే వీల్ చైర్ ఏర్పాటు చేసి అందించిన డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, ఎఫ్ ఆర్ ఓ రవి కృష్ణ లపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడి

- వేములవాడతో పాటు పలు చోట్ల హెూటళ్లపై..
- ప్రముఖ హెూటల్‌కు హెవీ ఫైన్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు రెస్టారెంట్లలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులు, డైరెక్టర్ ఐపిఎం డాక్టర్ సి శివలీల ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ పి. రోహిత్ రెడ్డి , శ్రీషిక ,పి.స్వాతి,వి.అంకిత్ రెడ్డి లతో కూడిన బృందం వేములవాడ మండల కేంద్రంలో గల తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో భోజనం తయారు చేయడం, కిటికీలకు మెష్ లేకపోవడం,పెస్ట్ కంట్రోల్ పాటించకపోవడం, అపరిశుభ్రంగా ఉన్న రిఫ్రిజిరేటర్లలో నిలువ చేసిన దుర్వాసనతో కూడిన మాంసపు ఉత్పత్తులను భారీ మొత్తంలో గుర్తించడం, అలాగే ఎగ్జాస్టర్ ఫాన్స్ పై నూనెతో కూడిన నూనె దుమ్ము ధూళితో పేరుకుపోవడం, ఫుడ్ హ్యాండ్లర్స్ హెయిర్ క్యాప్ మరియు హ్యాండ్ గ్లోవ్స్ ధరించకపోవడమ్,అపరిశుభ్ర ప్రాంతంలో మూతలు తీసిన దుమ్ము ధూళి ఈగలతో కూడిన వండిన ఆహార పదార్థాలను, కుళ్లిన ఉడికిన గుడ్లు హానికర రసాయనాలతో కూడినటువంటి కృత్రిమ రంగులను బిరియాని మరియు ఇతర ఆహార తయారీకి ఉపయోగించడం గుర్తించారు.

మిగతా 4వ పేజీలో..

## నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలు కీలకం




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలు,ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతుల వినియోగం కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.నేర సంఘటన స్థలంలో ఆధారాల సేకరణ,భద్రతలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా కేసుల దర్యాప్తులో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చున్నారు.నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత ఉపయోగం పెరుగుతున్న నేపథ్యంలో,కేసుల విచారణలో ఆధారాలను సైన్స్ పరంగా విశ్లేషించడానికి ఫోరెన్సిక్ శిక్షణ ఎంతో అవసరమని అందులో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో మెడికల్ కళశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలోని ఇన్వెస్టిగేషన్ అధికారులకు,స్టేషన్ రైటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.ఆధునిక శాస్త్రీయ విధానాల ద్వారా నేరాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ మరింత ప్రావీణ్యంతో ముందుకు సాగుతోందని,నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత ఉపయోగం పెరుగుతున్న నేపథ్యంలో,కేసుల విచారణలో ఆధారాలను సైన్స్ పరంగా విశ్లేషించడానికి ఫోరెన్సిక్ శిక్షణ ఎంతో అవసరమన్నారు.ఇలాంటి శిక్షణల ద్వారా కేసుల విచారణలో మరింత నిష్ణాతులుగా తయారయ్యేలా పోలీస్ అధికారులకు,సిబ్బందికి దోహదపడతాయన్నారు.హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనాలు మొదలగు నేర సంఘటనలో ఆధారాలు ఏ విధంగా సేకరించాలి, ఏ ఏ ఆధారాలు సేకరించాలి,ఏ విధంగా భద్రపరచాలి,ఫోరెన్సిక్ ల్యాబరేటరికి ఎం ఎం పంపించాలనె అంశాలపై ఇన్వెస్టిగేషన్ అధికారులకు,స్టేషన్ రైటర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.జిల్లా పోలీస్ అధికారులకు,సిబ్బందికి ఫోరెన్సిక్ సైన్స్ పై అవగాహన కల్పించిన మెడికల్ కళశాల వైద్య బృందాన్ని అభినందించి మెమోంటోస్ అందించిన జిల్లా ఎస్పీ .ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరి, వైస్ ప్రెసిపల్ డా. లక్ష్మీ నారాయణ,డా. నిర్విష హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఫోరెన్సిక్ మెడిసిన్, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, మధుకర్, ఎస్.ఐ లు అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్స్ పాల్గొన్నారు.

## అటవీ భూమిలో అక్రమ నిర్మాణం..!?

- రాత్రికి రాత్రే షెడ్డు? - ఎకరం వరకు కబ్జా..!?

**వేద న్యూస్, కాళేశ్వరం:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి భక్తుల సందర్శన రోజురోజుకూ పెరుగుతోందని చెప్పొచ్చు. ప్రతిరోజూ భక్తులు పుణ్యక్షేత్ర దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ప్రాంత సమీపంలోని భూములన్నింటికీ ఫుల్ డిమాండ్ వచ్చింది. ఇక పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా కొందరు చిరు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే వారు అటవీ శాఖ భూమిని ఒక ఎకరం వరకు కబ్జా చేసి అందులో 100 ఫీట్ల షెడ్డు నిర్మాణం చేసుకున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**- ఆక్రమణదారులకు ఎవరి అండదండలు!?**

కాళేశ్వరంలో ప్రస్తుతం ఉన్న బస్‌స్టాప్ స్థలం చిన్నదిగా ఉండటం వల్ల నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే సదరు ప్రాంతంలో పుష్కరాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ స్థలాన్ని అధికారులు నూతన బస్టాండ్ నిర్మాణం కోసం పరిశీలించగా, ఆ భూమికి ఆనుకొని ఉన్న అటవీశాఖ భూమిలో కొందరు అక్రమ దారులు అధికార పార్టీ నాయకుల అండదండలతో ఏకంగా గోదామంతా షెడ్డు నిర్మాణం చకచకా రాత్రి, పగలు అనే తేడా లేకుండా చేపడుతున్నట్టు తెలుస్తోంది. సర్వేనం.129లోని ఈ ల్యాండ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందినదని సమాచారం. కాగా, అటవీశాఖ ఉన్నతాధికారులు సదరు ఫారెస్ట్ ల్యాండ్‌ను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అటవీ భూమి ఆక్రమణ విషయమై 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ప్రతినిధి డీఎఫ్‌వోను వివరణ కోరగా, తమ దృష్టికి ఈ విషయం రాలేదని, సిబ్బంది ద్వారా విచారణ చేపడుతామని పేర్కొన్నారు.



# బిడ్డకు తల్లిపాలే అమృతం



- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- కొండపాక అంగన్‌వాడీ కేంద్రంలో..

**వేద న్యూస్, జమ్మికుంట:**

బిడ్డకు తల్లి అందించే అమృతం ముర్రుపాలు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాల వారోత్సవాలు వీణవంక మండల పరిధిలోని కొండపాక అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, రెండేండ్ల వరకు తల్లిపాలు కొనసాగించాలని తల్లులకు సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, అంగన్ వాడీ టీచర్స్ మాధవి, మల్లేశ్వరి,హెల్పర్లు, కార్యదర్శి పల్లె దవాఖాన డాక్టర్ జయంతి ఆశాలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- 97 మంది బాలబాలికల సంరక్షణ. - ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్.,

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుంది. అందులో భాగంగా జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం ఈసంవత్సరం జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ,చైల్డ్ వెల్ఫేర్,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్,చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్,రెవెన్యూ, హెల్త్ డిపార్ట్మెంట్ ,వివిధ శాఖల అధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 97 మంది బాలబాలికలను గుర్తించి సీ డబ్ల్యూ సీ ముందు హాజరుపర్చగా వారి యొక్క తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగించడం జరిగిందని,18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 14 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు.తరుచు బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.వీధి బాలలను చూసినప్పుడు స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు.ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను,సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# సమస్యల వలయంలో బోయినిపల్లి..!

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం గ్రామాల వారిగా చూసుకుంటే అభివృద్ధి పనులు ఎక్కడ కనబడడం లేదు. మరి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,ఎన్నికల ముందు అభివృద్ధి పనులు చేపడతానని చెప్పి అధికారంలోకి వచ్చి రేపో, మా పో రెండు సంవత్సరాలు పూర్తి కావడానికి వస్తుంది. మరి ఇప్పటివరకు మండల కేంద్రంలో గాని, గ్రామాల వారిగా సిమెంట్ రోడ్లు, ఇతర సమస్యలు,చూసుకుంటే నూతన బ్రిడ్జిల నిర్మాణంలో గాని, రోడ్ల దుస్థితి గాని, చాలా అధ్వానంగా తయారయ్యాయి.అలాగే మండలంలో అతి ముఖ్యమైన చౌరస్తా పాయింట్ కొదురుపాక రౌండప్ బోర్డ్ చూసుకుంటే సుందరీకరణ నిర్మాణం పనులు,చేపట్టడంలోగాని, మహిళలకు కొదురుపాక, వెంకట్రావుపల్లి, చౌరస్తాల వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయడంలో గాని పూర్తిగా అభివృద్ధి పనుల విషయంలో చాలా అశ్రద్ధ వహిస్తున్నారు. ఇప్పటికైనా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అభివృద్ధి విషయంలో దూకుడు పెంచి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టాలని,పత్రిక ముఖంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురుజాల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# సీజనల్ వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన

**వేద న్యూస్,బోయినపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఏఎన్ఎం వసంత తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి వ్యాధుల లక్షణాలు, వ్యాప్తి, నివారణ మార్గాల గురించి అవగాహన . వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, నీటిని శుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాల పై సూచనలు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో ఏఎన్ఎం వసంత, ఆశా వర్కర్లు అనసూయ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో విద్యార్థుల పాత్ర కీలకం

-ఓయూ ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొ.విద్యాసాగర్



**వేద న్యూస్ , హైదరాబాద్ ప్రతినిధి:**

సామాజిక సేవలో విద్యార్థుల పాత్ర కీలకమని, అందుకు జాతీయ సేవా పథకం తోడ్పడుతుందని అన్నారు ఓయూ ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొ.విద్యాసాగర్. ప్రభుత్వ సిటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి తోడ్పడే వేదిక జాతీయ సేవా పథకమని, 'నేను కాదు నువ్వు' అనే నినాదంతో స్వార్థం విడిచి సేవాభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈ సేవా పథకం ప్రయోజనాలను అంది పుచ్చుకుని, సమగ్ర గ్రామీణ, పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కాలేజి వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనటం వల్ల సామాజిక స్థితిగతుల పట్ల విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కళాశాలకు, సమాజానికి మధ్య వారధిగా పనిచేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని మరో వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శాంతి అన్నారు. ఈ సమావేశంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.వి.శ్రీదేవి, డా.రవీంద్రబాబు, డా. బి.సుదక్షణ, డా.ఎల్. తిరుపతి, డా.కృష్ణ చంద్ర కీర్తి, సమన్వయ కర్త డా.డి.నాగరాజు, డా.ఆనంద్, డా. మల్లికార్జున్, డా.కోయి కోటేశ్వరరావు, ఎన్ సిసి సమన్వయకర్త ఎస్.పి.కృష్ణవేణి, డా. పి.అనసూయ, సుమన యాదిగిరి, 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజేందర్ పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్
- కలెక్టర్ ను కలిసిన జర్నలిస్టు నేతలు

**వేద న్యూస్ , హన్మకొండ :**




హన్మకొండ జిల్లాలో ఇటీవల సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు పెట్టిన తప్పుడు కేసును వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్,బండి విజయ్ కుమార్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపురావు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ తదితరులు హన్మకొండ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు బనాయించిన తప్పుడు కేసు వివరాలను వారు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ,రాజేందర్ గతంలో దాదాపు పదేండ్లు వివిధ పత్రికల్లో రిపోర్టర్ గా పనిచేశారని, ప్రస్తుతం సొంత పత్రికను నడుపుతున్నారని,ఐనవోలు తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై రాజేందర్ పత్రికలో వరుస కథనాలు ప్రచురించారని తెలిపారు. దీనిని మనసులో పెట్టుకున్న ఐనవోలు తహశీల్దార్ రాజేందర్ పై కుట్రపన్ని పథకం ప్రకారం ఓ యూట్యూబర్ సహాయంతో పోలీసులతో కుమ్మక్కై కావాలని తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు పంపించారని ఆరోపించారు. నీతి, నిజాయితీతో వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి తప్పుడు కేసులు పెట్టడం సరైంది కాదని అన్నారు. కావాలని ఒకరిద్దరు రాజేందర్ పై సోషల్ మీడియా వేదికగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్న యూట్యూబర్ ను వదిలేసి ఏ తప్పు చేయని జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు అక్రమంగా కేసు బనాయించి వేధిస్తున్నారని అన్నారు.ఈ కుట్రపూరిత అక్రమ కేసు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు పెట్టిన కేసును ఉపసంహరింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన భూములు, ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్ లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. జర్నలిస్టులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులకు బాధ్యులైన ఐనవోలు తహశీల్దార్, ఎస్ ఐలను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి జర్నలిస్టు దామెర రాజేందర్ పై అక్రమ కేసు తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోలమాని గోపాల్, పాలడుగుల సురేందర్, సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బైపాస్ రోడ్ లో సెంట్రల్ లైటింగ్ వెలుగులు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు కుడివైపు బైపాస్ లో సెంట్రల్ లైటింగ్ వెలుగులు అందుబాటులోకి తీసుకువచ్చామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి వెంకటాపూర్ కు ఉన్న రోడ్డులో 11 కిలోమీటర్లు విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను శుక్రవారం కే కే మహేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి వెంకటాపూర్ కు ఉన్న రోడ్డులో రగుడు, చంద్రంపేట, చిన్న బోనాల, పెద్ద బోనాల, పెద్దూర్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేశారు. సీడీఎంఏ నిధులు రూ.4 కోట్ల 60 లక్షలతో మొత్తం పొడవు 11 కిలోమీటర్లు విస్తీర్ణంలో మొత్తం 437 స్తంభాలు, నాలుగు హై మాస్ట్ స్తంభాలు ఏర్పాటు చేశారని వెల్లడించారు. దీంతో బై పాస్ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, ఇతర ప్రాంతాల వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో



సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య తోనే ఉన్నత శిఖరాలు

**వేద న్యూస్, శాయంపేట:**

పేదరికం అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలంటే విద్యతోనే సాధ్యం అవుతుందని అప్పుడే మన జీవితానికి పరిపూర్ణత లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బైరి వెంకటరామిరెడ్డి అన్నారు. శాయంపేట మండలం పెద్దకోడపాక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మాలోతు సారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ బైరి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణతో చదివి తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం దూర ప్రాంతాలు అయిన కామారెడ్డి పల్లి ,మైలారం, గోవిందపూర్, జోగంపల్లి నుండి వస్తున్న పదిమంది విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసారు. ప్రధానోపాధ్యాయులు మాలోతు సారయ్య మాట్లాడుతూ మనం చదువుకున్న పాఠశాలలకు తిరిగి మనకు వీలైనంత స్థాయిలో సహకరించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ,




ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం ప్రొఫెసర్ బైరి వెంకటరామిరెడ్డి కి విద్యార్థులు సైకిళ్ళు పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# కనబడుట లేదు



**వేద న్యూస్, శాయంపేట:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కేంద్రానికి చెందినఈ ఫోటోలోని వ్యక్తి పేరు పొట్టకారి వికాస్ 31సంవత్సరాలు గత మంగళవారం రోజు నుండి కనబడుట లేదు. అతను 6 అడుగుల ఎత్తు, చామనచాయ రంగులో ఉండి, తెలుపు రంగు షర్ట్ ,నలుపు రంగు ప్యాంటు ధరించి ఉంటాడు అని ఒక ప్రకటనలో తెలిపారు.కావున ఆచూకీ తెలిసిన వారు 8712685227 ,8712685018. నెంబర్ కి పొన్ చేసి సమాచారం ఇవ్వాలని శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర్ ప్రకటనలో తెలిపారు.

# బియ్యం వితరణ



**వేద న్యూస్, చొప్పదండి**

చొప్పదండి మునిసిపాలిటీ పరిధిలోని 12 వ వార్డులో వారం రోజుల క్రితం గర్శకుర్తి లక్ష్మి 80 సంవత్సరాలు అనారోగ్యంతో మరణించారు. వారు కడు పేదరికం గడుపుతున్నారనీ తెలిసి చొప్పదండి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ముగ్దం తిరుపతి గౌడ్ 50 కిలోల బియ్యం ను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిజానాపురం చందు, మార్కెట్ చైర్మన్ కొత్తూరీ మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా బిసి ప్రధాన కార్యదర్శి గుర్రం రమేష్, రజక మండల సంఘం అధ్యక్షులు మావురపు రాములు, బొడిగే తిరుపతి, బొడిగే వెంకట్ పాల్గొన్నారు.

# సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై కొనసాగుతున్న విచారణ

**వేదన్యూస్ డెస్క్:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇవాళ(శుక్రవారం) డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. సృష్టి కేసు వ్యవహారంలో తొలిరోజు కస్టడీలో భాగంగా డాక్టర్ నమ్రతను పోలీసులు విచారిస్తున్నారు. సుమారు ఐదు గంటలుగా నమ్రతకు గోపాలపురం పోలీసులు ప్రశ్నలు సంధిస్తున్నారు. నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. అయితే.. చైల్డ్ ట్రాఫికింగ్‌పై అడిగిన ప్రశ్నలకు నమ్రత నోరు మెదపడం లేదని సమాచారం. ఎటువంటి తప్పు చేయలేదంటూ సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది. తాను ఎవరినీ బెదిరించలేదని, మోసం చేయలేదని పేర్కొంది. నిజనిజాలు త్వరలోనే బయటపడుతాయని పోలీసులతో నమ్రత చెప్పినట్లు తెలుస్తోంది. నమ్రత ఏజెంట్లు, ఆశా వర్కర్ల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక్కొక్క దంపతుల వద్ద ఎంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ప్రశ్నిస్తున్నారు. విజయవాడ, వైజాగ్, హైదరాబాద్ సృష్టి ఫెర్టిలిటీ బ్రాంచీలపై వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమంది తల్లిదండ్రులకు పిల్లలను సరోగసి పేరుతో విక్రయాలు జరిపారు..? న్యాయవాది వృత్తి పేరుతో కొడుకు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించడంపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్లో నమోదు చేసుకున్న తల్లిదండ్రుల వివరాలపైనా ఆరా తీస్తున్నారు. ఎలాంటి పశ్చాతాపం లేకుండా పిల్లలను దత్తతకు అరేంజ్ చేశామని బహిరంగంగానే నమ్రత చెబుతున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలో ఖైదీగా ఉన్న డాక్టర్ నమ్రతను ఇవాళ (శుక్రవారం) పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఇవాల్టి నుంచి ఐదు రోజులపాటు నమ్రతను గోపాలపురం పోలీసులు విచారించనున్నారు. నమ్రతపై హ్యూమన్ ట్రాఫికింగ్‌తోపాటు పలు కేసులు నమోదు అయ్యాయి. పిల్లలు లేని దంపతులను టార్గెట్‌గా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లో సరోగసి మాటున శిశువుల విక్రయాలు, అలాగే ఇతరుల స్పర్మ్ తో పిల్లలు పుట్టేలా చేశారనే ఆరోపణలపై డాక్టర్ నమ్రతను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# యూరియా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**వేద న్యూస్, రుద్రంగి :**





రుద్రంగి పరిధిలోని మానాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ని తనిఖీ చేసిన ఎస్.ఐ శ్రీనివాస్.ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ. యూరియా అక్రమంగా దాచిపెట్టిన రవాణా చేసిన , బ్లాక్ మార్కెటింగ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు సూచించిన దాని ప్రకారం రైతులు యూరియా వాడుకోవాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా యూరియా దాచిపెట్టిన వ్యవసాయేతర పనులకు యూరియా వాడిన ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని సూచించారు.ఎస్.ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# గుమ్మడి మల్లేశం సేవలు మరువలేనివి

## – కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్

**వేద న్యూస్, జమ్మికుంట:**




కరీంనగర్ జిల్లా కేడిసిసి బ్యాంక్ గొల్లపల్లి శాఖ మేనేజర్ గా విధులు నిర్వహించిన గుమ్మడి మల్లేశం ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం కరీంనగర్ కేడీసీసీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెస్కాబ్ , చైర్మన్ కోడూరి రవీందర్, వైస్ చైర్మన్ పింగిలి రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుమ్మడి మల్లేశం ఉద్యోగ విరమణ తర్వాత , ఆయన మంచి శేష జీవితం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో గడపాలన్నారు. మల్లేశం అటెండర్ స్థాయి మేనేజర్ ఎదగడం చాలా గొప్పవిషయమని చెప్పారు. సంస్థ ఉన్నతికి ఎంతగానో కృషి చేశారని వెల్లడించారు. 30 ఏండ్లు బ్యాంకుకు సేవలు అందించి రిటైర్మెంట్ కూడా కావడం సంతోషం అన్నారు. ఆయన ఏ పని చెప్పిన అంకితభవంతో చేశారని పేర్కొన్నారు.

# సల్కునూరు సహకార సంఘం ఎరువులను ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



వేములపల్లి మండల కేంద్రంలోని సల్కునూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువులను శుక్రవారం సహకార సంఘం డీజీఎం రామాంజి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలను రికార్డులను పరిశీలించారు. ఎరువులు వివరాలను ఎప్పటికప్పుడు ఈపాస్ మిషన్లో పొందుపరచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు ఎమ్మార్పీ రేట్లకే రైతులకు అందించాలని సూచించారు. అయన వెంట సహకార సంఘం అధికారులు భాను బాబు,శ్రీనివాసు,అలివేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో వాకిటి నరేష్, సిబ్బంది ఉన్నారు.

# రౌడి షీటర్ పై పీడీ యాక్ట్ నమోదు




**వేద న్యూస్, చందుర్తి :**

చందుర్తి మండలనికి చెందిన నిందుతుడు మనోజ్ కి పిడి యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి శుక్రవారం చందుర్తి సి.ఐ ఆధ్వర్యంలో చర్లపల్లి జైలు కి తరలించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సం.లో హత్య కేసులో, దొంగతనం , బెదిరింపులకు పాల్పడిన కేసులలో నిందుతుడిగా మనోజ్. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న మనోజ్ పై 2024 సంవత్సరంలో రౌడి షీట్ ఓపెన్ అయ్యింది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం చందుర్తి మండలనికి చెందిన బొల్లు మనోజ్ అనే వ్యక్తి మహిళ హత్య కేసు తో పాటుగా, హత్య కేసులల్లో, దొంగతనం,బెదిరింపులకు పాల్పడిన కేసులలో నిందుతుడిగా ఉండి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ తరచు ప్రజలను భయబ్రాంతులకు గురి చేయగా 2024 సంవత్సరంలో మనోజ్ పై రౌడి షీట్ ఓపెన్ చేసి పలు మార్లు కౌన్సెలింగ్ నిర్వహించిన మనోజ్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రానప్పటికి తరచు నేరాలకు పాల్పడుతు ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నందున జిల్లా కలెక్టర్ పిడి యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేయగా చందుర్తి సి.ఐ వెంకటేశ్వర్లు మనోజ్ కి పిడి యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి నిందుతుణ్ణి చర్లపల్లి జైలుకు తరలించడం జరిగింది.జిల్లాలో ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ ఈసందర్భంగా హెచ్చరించారు. జిల్లాలో ఉన్న రౌడి షీటర్స్ పై పాత కేసులలో ఉన్న నెరస్థులపై నిత్యం పోలీస్ నిఘా ఉంటుందని, గతంలో పలు కేసులల్లో నిందుతులగా ఉండి తరచు నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ అమలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## జూనియర్ లను వదిలి..

# సీనియర్ లకు బదిలీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 221 మంది విద్యార్థులకు సాంఘికశాస్త్రం బోదిస్తున్న ఉపాధ్యాయురాలిని శుక్రవారం రోజు వర్క్ అడ్జస్మెంట్ లో భాగంగా జిల్లా విద్యాశాఖ,అనంతగిరి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కాని విచిత్రం ఏంటంటే అదే మండలంలోని గాలిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 150 మంది విద్యార్థులు కు సోషల్ బోదిస్తున్న రెండు సోషల్ పోస్టుల్లో ఒకరైన జూనియర్ ఉపాధ్యాయుడు,కందికట్కూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కూడా 88 మంది విద్యార్థులకు సోషల్ బోదిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు జూనియర్ ఉన్నారు.ఈ ఇద్దరు ఉపాధ్యాయులు ఇల్లంతకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలి కంటే జూనియర్స్ అయినప్పటికీ కూడా వారిని బదిలీ చేయకుండా,సీనియర్ ఉపాధ్యాయురాలును బదిలీ చేయటం వెనుక జిల్లా విద్యాశాఖ,కలెక్టరేట్ లలో పైరవీలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థం అవుతుంది.వర్క్ అడ్జస్మెంట్ లో సీనియర్స్ ను వదిలి జూనియర్స్ ను మాత్రమే బదిలీ చేయాలి అని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి కూడా అవేమి పట్టకుండా బదిలీ చేయటం దారుణం అని అంటున్నారు. ఇంకా ముఖ్య విషయం ఏంటంటే ఇల్లంతకుంట జడ్పహెచ్ఎస్ పాఠశాలలో 221 మంది విద్యార్థులు మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూల్ అయినప్పటికీ కూడా ఇక్కడి నుండి బదిలీ చేయటం దారుణం అంటున్నారు.ఇప్పటికైనా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తప్పుడు బదిలీలను నిలిపివేసి,న్యాయపరంగా సీనియర్స్,జూనియర్స్ ను పరిగణలోకి తీసుకుంటూ బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

## రైలు కిందపడి గుర్తుతెలియని

# వ్యక్తి ఆత్మహత్య

**వేద న్యూస్, కాజీపేట :**





జి ఆర్ పి కాజిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాతిమా బ్రిడ్జి క్రింద గల రైలు పట్టాలపై గుర్తుతెలియని మగ వ్యక్తి సుమారు 35 నుండి 40 సంవత్సరాలు ప్రమాదవశాత్తుగా గాని, ఆత్మహత్య చేసుకున్నట్లు గాని, మరే ఇతర కారణాలవల్ల గాని గుర్తుతెలియని రైలు బండి కింద పడి చనిపోయి ఉన్నాడని కాజీపేట రైల్వే జి ఆర్ పి పోలీసులు తెలిపారు. అతని ఎడమ చేతి పై శివలింగము డమరుకం శూలము కలిపి పచ్చబొట్టు కలదని, చాతి పై పుట్టుమచ్చ కలదన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీ నందు భద్రపరచామని, మృతుని ఆచూకీ తెలిసినచో జి ఆర్ పి కాజీపేట ఎస్ ఐ ఆర్ పి 8712658609, 9440027342 గల నంబర్లకు ఫోన్ చేసి తెలుపగలరన్నారు.

# పెన్షన్ తిప్పలు

**వేద న్యూస్, వేములవాడ రూరల్ :**

వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి, పోశెట్టిపల్లి గ్రామాల వృద్ధులు, వితంతువులు ప్రతి నెలా పెన్షన్ తీసుకునేందుకు మర్రిపల్లి లేదా కొనయపల్లె గ్రామాలకు వెళ్లాల్సి వస్తుండటంతో తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారు. వయస్సు మీద పడిన వారికి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించటం ఎంతో కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వయస్సుతో పాటు, ఆరోగ్యం బాగాలేక పోతే ఇలా ప్రయాణించడం ప్రమాదకరం" అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారి కావడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో వృద్ధులకు ఎదురవుతున్న ప్రధాన అవరోధాలు.

ఈ క్రమంలో, గ్రామంలోనే పెన్షన్ పంపిణీ సౌకర్యం ఏర్పాటు చేయాలని వృద్ధులు, వితంతువులు వేడుకుంటున్నారు. ఇది సాధ్యమయ్యే వరకు నెలనెలా వారిపై ఆర్థిక భారం, శారీరక ఇబ్బందులు పెరిగే అవకాశముంది.పెన్షన్ మన హక్కు.. దాన్ని పొందటానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి?" అంటూ విద్యార్థులు, యువత, గ్రామస్తులు కూడా వృద్ధులకు మద్దతుగా నిలుస్తున్నారు.జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లోనే పెన్షన్ పంపిణీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.



# ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడి

– 'మున్సిపల్' వారి చేత రూ.30 వేల ఫైన్

రెస్టారెంట్ లో రూ. 20 వేల 500 విలువ గల సుమారు 70 కిలోల నిల్వ ఉంచిన మాంసం, కాలం చెల్లిన టీ పౌడర్ మరియు ఇతర ముడి సరుకులు, లేబుల్ డిఫెన్స్ కలిగిన కాజు, మసాలా పొడులు, మిగిలి ఉంచిన బిర్యాని, ఇతర ఆహార పదార్థాలను ప్రజల ఆరోగ్య నిమిత్తం హోటల్ యాజమాన్యాన్ని ఫుడ్ సేఫ్టీ టాస్ఫోర్స్ హెడ్ వి.జ్యోతిర్మయి హెచ్చరించి.. అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఎఫ్ఎస్ఎస్ 2006 చట్టం ఉల్లంఘించినందుకు వారికి నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా మునిసిపల్ అధికారుల సమన్వయంతో హోటల్ నందు పూర్తిగా అపరిశుభ్ర వాతావరణ ఉన్నందున, ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006 మున్సిపల్ చట్టం 2019 ని ఉల్లంఘించినందుకు గాను వేములవాడ మున్సిపల్ అధికారులచే రూ.30 వేల జరిమానా విధించి రెస్టారెంట్ ను తదుపరి రెక్టిఫికేషన్ చర్యల నిమిత్తం తాత్కాలికంగా మూసి వేయించారు. అదేవిధంగా,రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గల రుచి హోటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేయగా, అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయడం, ఫుడ్ హ్యాండ్లర్స్,గ్లౌజ్ మరియు హెయిర్ క్యాప్స్ ధరించకపోవడం, పండిన ఆహారంపై మూతలు కప్పకపోవడం, ఈగలతో కూడిన ఆహారం ఉండడం, మూతలతో కూడిన డస్ట్ బిన్స్ వాడకపోవడం, పెస్ట్ కంట్రోల్ లేకపోవడం, స్టోర్ రూమ్ లో వంటకుఉపయోగించేటువంటి నాణ్యతలేని ముడి సరుకులు ఉండడం, కుళ్లిన ఫంగల్ ఇన్ఫెస్టేడ్ కాలిఫ్లవర్ క్యారెట్ మరియు ఇతర కూరగాయలు ఆహార తయారీకి ఉపయోగించడం, కాలం చెల్లిన ముడి సరుకులు, హోటల్ యాజమాన్యం కలిగి ఉండాల్సిన తగిన రికార్డ్స్ మెయింటైన్ చేయకపోవడం తో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ బృందం 2006 ఉల్లంఘించినందుకు , వారికి నోటీసులు జారీ చేశారు. అనుమానిత ఆహార పదార్థాల శాంపులను సేకరించి పరీక్ష నిమిత్తం హైదరాబాద్ లో గల ల్యాబ్ కు పంపించారు. అదేవిధంగా రూ. వెయ్యి విలువగల 5 కిలోల పురుగులతో కూడిన మైదాపిండి, కుళ్లిపోయిన కూరగాయలు, కాలం చెల్లిన ముడి సరుకులను ప్రజల ఆరోగ్యం నిమిత్తం అక్కడికక్కడే ధ్వంసం చేశారు.

**– రూల్స్ పాటించకుంటే క్రిమినల్ కేసులు**

నిబంధనలు పాటించని, ప్రభుత్వ అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తేల్చిచెప్పారు. వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి , టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు.అలాగే ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# సరసమైన ధరలో బాలుడికి చికిత్స

**– రిషిక ఆస్పత్రి చక్కటి వైద్య సేవలు – పేషెంట్ కుటుంబ సభ్యుల ధన్యావాదాలు**

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని రిషిక తల్లి, పిల్లల ఆస్పత్రిలో తమ బాలుడికి వైద్యులు అందించిన వైద్య సేవల పట్ల పేషెంట్ కుటుంబ సభ్యులు సంతృప్తి, సంతోషం వ్యక్తం చేశారు. సరసమైన ధరలో రోగ నిర్ధారణ చేయడంతో పాటు సరైన సమయంలో చికిత్స అందించినందుకు రోగి తల్లిదండ్రులు ఆస్పత్రి వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. వీణవంక నివాసి వీరస్వామి కుమారుడు కోజుల అభిరామ్ అనే 12 ఏళ్ల బాలుడికి గత 4 రోజులుగా అధిక జ్వరం ఉన్నది. 3 రోజులుగా వాంతులు, 3 రోజులుగా కడుపు నొప్పి ఉండటంతో వారు జమ్మికుంట పట్టణంలోని రిషిక తల్లి, పిల్లల హాస్పిటల్‌లో పీడియాట్రిక్ కన్సల్టెంట్, ఎండీ డాక్టర్ బి.రమేష్ వద్దకు తీసుకొచ్చారు. బాలుడు అనారోగ్యంగా ఉన్నారని, పైన పేర్కొన్న లక్షణాలని డాక్టర్‌కు వివరించారు. వెంటనే ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రమేశ్.. బాలుడు అనారోగ్యంగా ఉన్నాడని, మెక్‌బర్నీ టెండర్‌నెస్ ఉందని గుర్తించి, టెస్టులు నిర్వహించాలని సూచించారు. టెస్టులో అక్యూట్ అపెండిసైటిస్ అని నిర్ధారణ అయింది. దాంతో రిషిక ఆసుపత్రిలో జనరల్ సర్జన్, ఎంఎస్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి..బాలుడికి అపెండెక్టమీ (శస్త్రచికిత్స) నిర్వహించారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నారని, సరైన సమయంలో 'రిషిక' ఆస్పత్రి వారు ట్రీట్‌మెంట్ అందించారని పేషెంట్ పేరెంట్స్ వెల్లడించారు.



# ఉచిత ఆన్లైన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**

అన్ అకాడమీ ద్వారా అందించే ఉచిత శిక్షణ విద్యార్థులు అన్ని జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించేందుకు మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ ఇంటర్%డ% డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అన్ అకాడమీ ఆన్లైన్ క్లాస్ లను శుక్రవారం కేకే మహేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజ, వ్యక్తిగత మార్పుసాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత ఆన్లైన్ శిక్షణ తరగతులు కొనసాగిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠాలు చక్కగా విని నోట్స్ రాసుకోవాలని సూచించారు. మళ్ళీ సాయంకాలం వాటిని మరోసారి చదువుకోవాలని పేర్కొన్నారు. పాఠాల్లో ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలని సూచించారు. మ్యాథ్స్, సైన్స్ ఇతర పాఠ్యాంశాల్లో వచ్చే టెస్ట్ సిరీస్ ను ప్రాక్టీస్ చేయాలని కలెక్టర్ తెలిపారు. దీంతో ఐఐటీ, జే ఈ ఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో మంచి ప్రతిభ చూపించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

దేశంలోని నిపుణులైన టీచర్ల చే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన జిల్లాలోని విద్యార్థులకు కూడా అందిస్తున్నామన్నారు. ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని అన్నారు. కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రో మ్యాగ్నెటిసమ్ వంటి ముఖ్యమైన పాఠ్యాంశాలను కాన్సెప్ట్ పక్కాగా నేర్చుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సాబేరా బేగం, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ నగరంలోని ఆరేపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్ లను , అన్ని తరగతి గదులను, పాఠశాల ఆవరణను పరిశీలించి ఆవరణలో కలుపు పిచ్చి మొక్కలు ఉండడం పట్ల ప్రధానోపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా విధులకు గైరాజరైన వాచ్ మెన్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. విద్యార్థుల చేత హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలను చదివించి పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, ఇష్టపడి చదివి పాఠశాలకు మంచిపేరు తేవాలని సూచించారు. యూనిఫామ్స్ నోట్ బుక్స్ వచ్చాయని అంటూ వాకాబు చేశారు. పదవ తరగతి విద్యార్థి యూనిఫామ్ వేసుకోకుండా ఉండడం గమనించిన కలెక్టర్ సంబంధిత ఉపాధ్యాయుని యూనిఫామ్ లేనిది అనుమతించకూడదని తెలుపుతూ విద్యార్థి తల్లిదండ్రులతో చరవాణిలో మాట్లాడి యూనిఫామ్ యొక్క ప్రాముఖ్యత ను గురించి కలెక్టర్ వివరించారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయిలెట్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిశుభ్రకరమైన వాతావరణ ఉండేలా చూసుకోవాలని అధ్యాపకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



# ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డుపై వాహనాలను నిర్దేశిత స్థలాలకు వెలుపల నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రాణాలకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూల్స్ పాటించాలంటే మొదట అవగాహన అవసరమని, అందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలు సూచనలు, నిబంధనలపై వివరంగా చర్చించగా, ఆటో డ్రైవర్లు విశేషంగా స్పందించారు.

# నేడు టెన్త్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**వేద న్యూస్, చొప్పదండి :**

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, శిశు మందిర్ స్కూళ్లలో పదవ తరగతి చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందులో భాగంగా నేడు (శనివారం) చొప్పదండి నియోజకవర్గంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కానుక పేరుతో చేస్తున్న ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ తో పాటు జిల్లాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, బీజేపీ నాయకులు హాజరుకానున్నారు. సైకిళ్ల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమం కాదు. బండి సంజయ్ కుమార్ స్వయంగా వివిధ సంస్థల నుండి సేకరించిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్సార్) నిధులతో ఈ సైకిళ్లను కొనుగోలు చేసి పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ సైకిళ్ల పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా నేరుగా టెన్త్ విద్యార్థులకే అందాలనే లక్ష్యంతో ఆయా సైకిళ్లను సంబంధిత జిల్లాల కలెక్టర్లకు అందజేస్తున్నారు. వారి ద్వారా నేరుగా ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ చదివే విద్యార్థులందరికీ పంపిణీ చేస్తారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేలకుపైగా సైకిళ్లను బండి సంజయ్ పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, శిశు మందిర్ స్కూళ్లకు వెళ్లి టెన్త్ చదివే బాల, బాలికలకు నేరుగా సైకిళ్లను అందజేస్తున్నారు. రేపటి నుండి చొప్పదండి నియోజకవర్గంలో ఈ సైకిళ్ల పంపిణీని చేపట్టనున్నారు. చొప్పదండి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈరోజు చొప్పదండి విచ్చేసిన బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా దాదాపు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు బండి సంజయ్ చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు. అంతకుముందు చొప్పదండి పట్టణంలో 'ప్రధానమంత్రి కిసాన్ ఉత్సవ్ దివస్' కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొని రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధి సొమ్మును జమ చేయనున్నారు.

**-టెన్త్ విద్యార్థులకే ఎందుకంటే....**

ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదనే సదుద్దేశంతో బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేయనుండటం విశేషం.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073